సభ్యత

శ్రీ బలివాడ కాంతారావు

భర్త ఆఫీసునుంచి వచ్చాకే ఆ పోస్టుమేన్ వస్తాడు. కాస్త ముందుగా రాకూడదూ? సీతకు పోస్టుమేన్ అగపడినప్పుడల్లా గుండె బితుకు బితుకు మంటోంది.

ఆమె కాపరానికివచ్చి యేడాది అయ్యింది. వచ్చిన ఆరు నెలలూ యే గొడవా లేదు. తరవాత ఒకసారి తాతగారింటికి వెళ్ళినప్పుడు మోహనరావు బావ కలిశాడు. ఇదివరలానే తను మాటాడింది. కానీ చాటుగా యేవేవో నిందావాక్యాలు వేశాడు. కొన్ని సరిగ్గా ఆమెకు వినిపించాయ్. కొన్ని వినపడలేదు. విన్నాక యీయతగ్గ జవాబులు యిచ్చింది. ఏంచేస్తానో చూడు అన్నాడు. ఆమె అక్కడ వారంరోజులే వుంది. భర్త వచ్చాక కలసి వచ్చేసింది. వచ్చిన వారంరోజుల తరవాత మోహనరావు సీతకు వుత్తరం వ్రాశాడు. ఆ కవరుపై భార్య పేరు చూచి భర్త సూర్యారావు 'నీ వుత్తరం' అంటూ యిచ్చేశాడు.

సీతకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. తన చల్లని సంసారంలో అగ్ని రగుల్కొన్నట్లనిపించింది! ఆమెపై బావకు యెందుకో ఆ పగ? పిచ్చివానిచేతిలో రాయిలా—యీ వుత్తరం—ఆయన చూస్తే—యీ అబద్ధాలంతా నిజంగా తీసుకుంటే—తన కాపురం యేమైనట్లు? భర్త ఆ వుత్తరంగురించి అడిగితే యేమని చెప్పటం? ఆ మరుచటిరోజు ఆ వుత్తరాన్ని మండుతున్న పొయ్యిలో వేసింది! ఎన్నోసార్లు, ఆ వుత్తరంగురించి, యిదివరకు జరిగిన వివాదం గురించి చెప్దామనుకున్నది. చెప్పే ఆయనలో ఆమెలోపును కప్పి పుచ్చడానికి ముందుగా చెప్తోందన్న అనుమానం రేకెత్తించడమెందుకని వూరుకుంది.

సూర్యారావు ఆ వుత్తరంవిషయం పట్టించుకోనట్లుగానే మామూల్లుగా వున్నాడు. ఆ వుత్తరం యెవరు వ్రాశారనైనా అడగలేదు. ఇదివరకు రోజూ భార్యకు యిస్తున్న మర్యాద, లాలన యిప్పుడూ యిస్తున్నాడు!

భర్త ఆఫీసుకు వెళ్ళిపోగానే ఒంటిగావున్న సీత ఆలోచనలు పరిపరి విధాలుగా పోయాయి. చిన్ననాట తల్లిపోయింది. మారటితల్లి మూర్ఖత్వంనించి మేనమామ తప్పించాడు. తాతగారింట్లో పెరిగి పెద్దదైంది. ఏ ముద్దు ముచ్చట్లకు నోచుకోలేని ఆమెకు దేముడు వుత్తముడైన భర్తను ప్రసాదించాడు. ఏ ముహూర్తాన ఆ మూడు ముళ్లు పడ్డాయో అప్పటినుంచీ ఆయన ఆమెను సమ్మోహనం చేశాడు. ఆమెకు యింకొక ధ్యాసలేదు—చింతలేదు. లలితమైన ఆమెమనసు యింతవరకు కటుత్వాన్ని, బాధను భరించింది. భర్త ఆమెను యిదివరకు 'కని, యెరగని' ప్రేమతో లాలిస్తున్నాడు—ఆ లాలనలో ఆమె తన్మయత్వం చెందుతుంది—అతనికంటె మించినదేమీ ఆమెకు లేదు!

నెలకొక వుత్తరమైనా బావ రాస్తున్నాడు. వ్రాసినప్పుడల్లా ఆమెలో తుపాను రేగుతోంది. భర్త చల్లనిచూపు, ఆదరణలో ఆ తీవ్రత్వం చల్లార్చటానికి ప్రయత్నిస్తోంది. ఆ వుత్తరాల్ని దగ్ధం చేస్తోంది.

ఇప్పుడు ఆమె ఊహలు—ఎన్నో ఆశలు—ఆలోచనలు—అమ్మ అని పిలిపించుకొనే అదృష్టం తనకు వస్తోంది! "నాబాబుకు నాలాంటి రూపు—ఆయన గుణగణాలు—అమాయ, అహంభావం నా చిన్నితండ్రికి అంటనీయన్లే—నా చిన్నినాన్న, అమ్మ నాన్నకు కీర్తి తెస్తాడు!" బాబు అప్పుడే పుట్టినట్లు—ఆడించినట్లు—బుద్ధులుచెప్పి నీతికథలు చెప్తున్నట్లు అనుకుంది......

ఆవేళ సాయంత్రం భర్త ఆఫీసునుంచి వచ్చాడు! మామూల్లు చిరునగవు—ఆయన వెనకనే పోస్టుమేన్ వచ్చాడు—వుత్తరం వచ్చింది. అలా గదిలోనిల్చొనే ఆ కవరుపైనున్న రాత చూసి తనకే ఆ వుత్తరం వచ్చిందనుకున్నది—కానీ సూర్యారావు ఆమెకు యివ్వలేదు. "అదిగో చింపి చదువుతున్నారు!"—సీత కాళ్లు గజగజలాడి అక్కడ నిల్చోలేక వంటయింటికి వెళ్లిపోయింది కళ్లల్లో నీరు తిరిగింది.

గదిలోనుంచే "సీతా!" అని పిల్చాడు "అదిగో ఆగొంతుక కటువుగా వుంది—వాడు నా సంసారం కూల్చాలని పగబట్టాడు... నా దేముడా నాకేమీ తెలీదు... తెలీదు" మనసులోనే మాటాడుకుంది. ముందుకు అడుగువేస్తున్నా ఒళ్లంతా తూగిపోతోంది—

"ఇవేళ కోపంవచ్చిందా? ఎప్పుడూ లేనిది రాగానే వంటయింటికి వెళ్ళిపోయావ్?"

నిట్టూర్చింది. అంతరంగంలోనే యిది యెత్తి పొడుపేమో అనుకున్నది. ఆరాత్రి ఆమెకు నిద్దర సరిగ్గాపట్టలేదు. పట్టిన కాస్సేపైనా యేవేవో పాడుకలలు! మరుచటిరోజు భర్త ఆఫీసుకు వెళ్ళాక అలవాటుకొద్దీ భర్త తీగలో గుచ్చిన వుత్తరం తీసి చదివింది. అది ఆకాశరామన్న వుత్తరం. తన భర్తకే వ్రాశాడు—అదిగో దస్తూరీ మోహనరావు బావదే!

అదిచదివాక ఆమె శిలాప్రతిమలా కూర్చుంది. కాస్సేపయాక ఆ ప్రతిమ కళ్ళవెంబడి కన్నీరు ధారలుగా ప్రవహించసాగింది. ఆమె ఆశలు నిరాశలై ఆలోచనలు ఒకదారిన పోలేదు—

"నేనెందుకు బావతో మాటాడేదాన్ని? నాకెందుకో నాకు కొద్దిగానైనా వాడు యింత నీచుడనే ఆలోచన రాలేద"ని నొచ్చుకుంది. భర్తమీదనున్న గౌరవం, విశ్వాసంతో తన తప్పేమీ లేదని యెందుకు భయపడాలని, ఆమె సాయంత్రం సరికి మామూలుగా వుండటానికి ప్రయత్నించింది. ఎంత ప్రయత్నించినా యేదో వెలితిగా వున్నది.

ఆ వారం రోజుల్లోనే యింకో కవరు వచ్చింది. ఆ కవరు చదివాక తీగలో గుచ్చాడు. ఈసారి చాలసేపు అలా ఆలోచించుకొని కుర్చీమీద కూర్చున్న భర్తనుచూస్తుంటే సీతకు భయంవేసింది. ఈ వేళ యేదో అఘాయిత్యం జరుగుతుందనుకున్నది. ఆమెనిల్చున్న నేల పగిలిపోయినట్లు తను భూమాతలో ఐక్యమైనట్లు అనుకుంది—కానీ కొద్దిసేపయ్యాక సూర్యారావు మామూలుగా మాట్లాడాడు. ఆ రాత్రి భోజనందగ్గర పరధ్యానంగా వున్నాడు. ఈమార్పు సీతకు యెంతో కష్టం కలిగించింది. ఇంట్లోని చల్లని వాతావరణం మారిపోయినట్టయింది. ఆ రాత్రే భర్త ఇటూ అటూ నిద్రపట్ట

కదలటం చూసింది- "ఏంరాశాడో? యేమిటో? మొదటిఉత్తరంలో వ్రాసినదానికన్నా హెచ్చే వ్రాస్తాడుగానీ తక్కువ వ్రాయడే! అదిచాలదా? ఈయన అనుమానించడానికి?"

ఆమె భర్త ప్రక్కనవున్నా నిద్దర రాలేదు. తెల్లవారేసరికి తన బ్రతుకేమౌతుందో? భర్తచే విడువబడితే తనగతి? "నాబాబు... కడుపులో చాలా నే ఆరాటపడుతున్నాడు! నా నాయనా! నీ అదృష్టమైనా మీ నాన్నను మామూలుగా వుందనా? అవును— మీ నాన్న గొప్పవారు తండ్రీ? తల్లిలేని నన్ను—అన్ని విధాల బాధలుపడ్డ నన్ను—ఎంచిరొంచి కట్నం పుచ్చుకోకండా పెళ్ళి చేసుకున్నారే—అలాంటి మీ నాన్న—నన్ను అనుమానిస్తారా? అనవసరంగా నేను బాధపడుతున్నానుగానీ—నన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నట్లు చూస్తున్నారే—అలాంటి శాంతమూర్తి ఉత్తముడూ—నన్ను అనవసరంగా విధిపాలు చేస్తారా? చెయ్యరు నాయనా? చెయ్యరు"

కాస్సేపు ఆమెలో విశ్వాసం పాతుకపోయింది. కొద్ది క్షణాల్లో మళ్ళీ ఆరాటం పెనవేసుక వచ్చింది. "ఏమో! యీ విషయాల్లో మొగవాళ్ళకి సహనం వుండదంటారు. సహనంవుంటే యీయన యిలా నిద్దరపోకండా బాధపడ్తారా? శ్రీరామచంద్రుడు-మానవోత్తముడు—మహారాజు! నలుగురు తుంటరులు వేసిన అపనిందకు తలొగ్గి అగ్నిలో ప్రవేశించి తన పాతివ్రత్యాన్ని నిరూపించిన మా తల్లి నిండు చూలాలు సీతమ్మనే అడవిలో విడిచి పెట్టించాడుకదా? అలాంటిది నా దేముడు నన్ను యీ యింటిలో తెల్లవారేసరికి వుండనిస్తాడా? ఆయన పాదాలదగ్గర చచ్చిపోతాను గానీ...లోకం వేలెత్తి చూపించినట్లుగా విధిపాలుకాను...ఆయన దగ్గర లేకపోతే నేనోక్షణం బ్రతకలేను—ఏంచారి తండ్రీ?"

ఆమె నిశ్శబ్దంగా వలవలయేడ్చి తలగడ తడిపింది. "తెల్లవారితే చాలు ఆయన అడుగుతారు—యేమందని చెప్తాను? నేను చెప్పింది నిజమే—కానీ ఆయన నమ్మరు—కోపంతో పొమ్మంటారు...నే నేమన్నా వినరు—ఆయన పాదాలు పట్టుకుంటాను—నన్ను కోపంతో త్రోసివేస్తారు—యీడ్చిస్తే...ఆనాడు మా స్త్రీ జాతి ఆదర్శదేవత—సీతమ్మతల్లి ప్రార్థించినట్లుగా—మిమ్మల్ని తప్పించి యింకెవర్నీ నేను తలంచలేదు—మాటల్లోనూ, చేతల్లోనూ, ఆలోచనల్లోనూ మిమ్మల్నే కొలిచాను—మిమ్మల్ని తప్పించి యింకెవర్నీ నాకు తెలీదు—ఇదే నిజమైతే—నా తల్లీ భూమాతా నీలో నన్ను కలుపుకో—బుగ్గయి నీలో హాయిగా కలిసిపోతాను..."

ఆవేశంతో ఆమె అట్టుడికిపోయింది. నరాలన్నీ తోడుకొని బలహీనం చేశాయి. తెల్లవారుఝామున మాగన్ను నిద్దర పట్టింది. తెలివి వచ్చేసరికి భర్త టేబిలుముందుకూర్చుని యేదో వ్రాస్తున్నాడు. "ఎక్కడికి వెళ్ళిపోతారో—యేమో—ఆయన ముఖం చూడకుండా ఓ క్షణం వుండలేను..." కొంతసేపయ్యాక వ్రాసిన ఉత్తరం డ్రాయరులో పెట్టి "కాస్త అర్జంటు పనుంది. సీతా! లేలే—"అని పిలిచాడు. ఆమె లేచిందిగానీ కళ్ళల్లో నీరు తిరిగి పోతున్నాయ్. ఇంతలోనే సూర్యారావు ఆఫీసుకువెళ్ళే బట్టలు వేసుకున్నాడు. అంతా అలా నిల్చొనేచూస్తోంది. "ఈ పూటకు హోటలుకు పోతానులే—రాత్రే చెప్పటం మరిచిపోయాను—వేగం లేచేదానివి. మళ్ళీ సాయంత్రం వేగంగా వచ్చేస్తా!"

తొందరగా అంటూ వెళిపోయేముందు "అన్నట్టు సీతా! మీ బావ మోహనరావు ఉత్తరం వ్రాశాడుకానీ తన యెడ్రసు వ్రాయలేదు—ఇప్పుడు యెక్కడున్నాడో యేమిటో ఈ ఉత్తరం కవరులోపెట్టి నీకు యెడ్రసు తెలుసుకామోసు వ్రాసి పారుడు అబ్బాయిచేత పోష్టులో వెయ్యించేద్దూ!"

భర్త వెళ్ళిపోయాక డ్రాయరులోని ఉత్తరంతీసి చదవటానికి మొదలుపెట్టింది.

"తమ్ముడూ!

నీ ఉత్తరం నిన్న సాయంత్రమే చేరింది. అది చదివిన నిముషంనుంచీ నీ కెలా జవాబు వ్రాయాలనే ఆలోచనలతో రాత్రి సరిగా అన్నం సహించలేదు—నిద్దరా పట్టలేదు. ఇదివరకు బహుశః నివ్వే కామోసు అప్పుడప్పుడూ సీతపేర ఉత్తరాలు వ్రాసేవాడివి—అవి అగ్నిప్రీతి అయివుండొచ్చు—సీత యెలా ఘలానవారు వ్రాశారని—యే గొప్పవిషయా లున్నాయని నాతో చెప్తుంది? సరే సీతకు వ్రాశావు—ఆమెను కల్లోలపరచావని అంతతో తృప్తిపడక నాకో ఆకాశరామన్న ఉత్తరం వ్రాశావు. అది బట్టబాఖలా అయ్యిందని కామోసు భయపడి సీత మీద లేనిపోని నిందలు వేసి నాకే ఉత్తరం వ్రాశావు—

ఈ పైన వ్రాసిన పరిస్థితులు అవగాహన చేసుకుంటే నీ మనస్సూ మేధస్సూ యెంత సంస్కారం హీనమైనవో అర్థం చేసుకున్నాను. కానీ మర్యాద నాచే యీజవాబువ్రాయించింది.

నీ బ్రతుకు నీకు తెలుసు. చిన్నప్పటినుంచీ ఆమె యెన్ని కష్టాలు పడిందో? తండ్రి కూతురన్న కనీసపు బాధ్యతనే విడిచి పెట్టాడు. మీయింట చేరింది. గతిలేనిపిల్లని మీ వాళ్ళెవరూ నీకిచ్చి పెళ్ళిచెయ్యటానికి ఒప్పుకోలేదు. పోనీ నీవైనా పంతంబట్టి చేసుకున్నావు కావు. పొరుగున మా చెల్లాయి వుండి సీత మంచిచెడ్డలూ బ్రతుకూ నాతో చెప్పింది. కాబట్టి నేను ఆమె మంచిని ప్రేమించాను—ఆమె అసహాయతను కనికరించాను. నాకు యిల్లాలై ఆమె నన్నెంతగా కొలుస్తుందో నీకు తెలియదు!

నీతో చాలా చనువుగా సరదాగా వుండేదని వ్రాశావు. అందులోవున్న తప్పేమీ నాకుకనపడలేదు. సిగ్గుపడి తలుపుచాటునుంచిచూచే ఆడవాళ్ళకన్నా బాహాటంగా ఆదరంగా మాటాడే స్త్రీలనుచూస్తే నాకు హెచ్చు గౌరవం! నీ పేరుకు తగ్గట్టునివ్వు అందగాడివి. అందులో వరసకు బావ అవుతావ్—అలాంటప్పుడు నీతో చనువుగా మాటాడటంలో తప్పేం వుంది? పోనీ అలా మాటాడిందని నివ్వేం కనికరం చూపించావ్? నేనూ పెళ్ళికాకముందు యెందరు, అందమైన ఆడవాళ్ళ వేపుచూశాను. వాళ్ళ అందాన్ని కీర్తించాను. అంత అందమైన స్త్రీ నాభార్య అయితే బాగుండేదని తలచాను—నీవు వ్రాసిన దాన్నిబట్టి నేను సీతను వదిలేస్తే—ఇదంతా తెలిస్తే నన్ను వదిలెయ్యటానికి సీతక్కూడా హక్కు వుంది! కానీ మా యిద్దరం అంత తెలివితక్కువవారమ్ము కాము!

ఆడవాళ్ళమీద నివ్వు విసిరే విసుర్లు నేను అర్థంచేసుకోలేకండా వున్నాను. స్త్రీ మగవానికి తల్లయి పాలిచ్చి కష్టపడి ఓర్పుతో పెంచి పెద్దచేస్తుంది—స్త్రీ భార్యయై మగవానికి సౌభాగ్యాన్ని యిస్తుంది—ఆమె పల్లాడిన ముదుసలియై నిజాన్ని జ్ఞానాన్ని మగవాడికి అందిస్తుంది—మగవాళ్లు ఆడవాళ్ళమీద యేదైనా నెపము అపాదించేముందు స్త్రీ చేసే యీ మేలును తలుచుకోరేం? కృతఘ్నులై వారివారి యిళ్లను దేవాలయాలు చేసుకొనే బదులు యుద్ధరంగాలుగా మార్చుకుంటారేం? ఆడవాళ్ళను గౌరవించే కనీసపు సభ్యత మగవాళ్లలో లేకపోతే ఆ సంఘం సజీవంగా యెంత కాలం వర్ధిల్లుతుంది?

తమ్ముడూ! ఒకసారి మా యింటికివచ్చి నేనూ మా సీతా యిచ్చిన ఆతిథ్యం స్వీకరించకూడదా? నీకు తెలుసు మా సీత నిండు మనిషని-నివ్వు రాసినట్లు ఆమెను విడిచిపెట్టేదానికి నేనేమీ రాముడంత వాడ్ని కాను.

నీ అన్నయ్య,—సూర్యారావు.